క్లుప్తంగా

గంధం ఉత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే శంకరనారాయణను ఆహ్వానిస్తున్న దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా

పెనుకొండ రూరల్: దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన పెనుకొండ బాబయ్యస్వామి దర్గాలో జరుగనున్న ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే శంకరనారాయణకు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా ఆహ్వాన పత్రిక అందించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లారు. గంధం ఉత్సవానికి రావాలని ఆహ్వానం పలికారు.

పలువురికి రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

హిందూపురం టౌన్: స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పలువురికి టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన సంఘం ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అశ్వర్థమ్మకు బీ పాజిటివ్, చేతన్‌కు ఏ నెగిటివ్, సమీవుల్లాకు బీ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో విషయం తెలుసుకున్న ఆ సంఘం అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్, షబ్బీర్ సహకారంతో దాతలు నూరుల్లా, ఉస్మాన్, చంద్రలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో హుసేన్, హిదాయత్, షారుక్‌ఖాన్, సాధిక్, జబీ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

హిందూపురం: పట్టణ పరిధిలోని అన్నివార్డుల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తూ శుభ్రతపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ ఆఫీసులో మున్సిపల్ ఇంజనీరింగ్, శానిటేషన్ సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రిస్మస్, న్యూఇయర్ సందర్భంగా పట్టణంలోని అపుభ్రత, చెత్త చెదరం ఎక్కడా కనిపించకుండా అన్నివార్డుల్లో పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలన్నారు.

పట్టు రైతులకు అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డా.సీతారామ్

గుడిబండ: మండల పరిధిలోని కురుబరపల్లిలో పట్టు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. శాస్త్రవేత్త సీతారామ్ మాట్లాడుతూ పట్టు పురుగుల పెంపకంలో శాస్త్రీయ విధానాలే నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తికి దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. సెరికల్చర్ ఏడీ రాజు, గుడిబండ టెక్నికల్ ఆఫీసర్ రియాజుల్లా, పట్టు రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

మడకశిర: రైతులు రబీలో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మడకశిర ఆర్బీకే ఇన్‌చార్జ్ రాజేష్ బాబు కోరారు. శుక్రవారం ఆయన పట్టణంలోని రైతులు రబీలో సాగు చేసిన వివిధ పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేశారు. ఆయన మట్లాడుతూ పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుంటేనే ప్రభుత్వం అందించే పథకాలు అందుతాయన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

మడకశిరరూరల్: జనవరి నుంచి పింఛన్‌దారులకు నెలకు రూ.3 పింఛన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో శుక్రవారం జెడ్పీటీసీ సరోజమ్మ ఆధ్వర్యంలో జమ్మానిపల్లి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



వెంకటేశ్ (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ వెంకటేశ్ (58) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ గ్రామానికి చేరుకుని వెంకటేశ్ భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ పరమేష్, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కొండలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన సీఅండ్ఐజీ చర్చి



పట్టణంలోని దుకాణంలో అమ్మకానికి ఉంచిన స్టార్లు



పెనుకొండ: అలంకరణలో సీఅండ్ఐజీ మిషన్ చర్చి

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు
- జోరుగా దుస్తులు, సామగ్రి కొనుగోలు

హిందూపురం అర్బన్: ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది జరుపుకునే పండుగ క్రిస్మస్. ప్రతియేటా డిసెంబర్ 25వ తేదీన క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మార్కెట్‌లో ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది. కేకులు ఆర్డర్స్ ఇస్తుండటంతో స్వీటుషాపులు కిటకిటలాడుతున్నాయి. రాయలసీమలోనే అత్యంత ప్రాధాన్యత సంతరించుకొన్న హిందూపురంలోని సీఅండ్ఐజీ చర్చి నవకాంతులు వెదజల్లుతోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఈ చర్చి అప్పట్లో ప్రారంభించారు. ఇందులో ఒకే సారి 2000 మంది ప్రార్థనలు చేసుకోవచ్చు. ఇక పట్టణంలోని పలు చర్చిలు విద్యుత్ అలంకరణలతో పండుగకు ఆహ్వానం పలుకుతున్నాయి.

కళ కళలాడుతున్న మార్కెట్లు

ఎల్లుండి క్రిస్మస్ పండుగ ఉండటంతో క్రిస్మస్ సామగ్రి కొనుగోళ్లతో హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని ఉన్న దుకాణాలు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా క్రిస్మస్ ట్రీలు, స్టార్లు, గంటలు, పిల్లలకు క్రిస్మస్ తాతయ్య దుస్తులు, మాస్కులు, బెలూన్ లైట్, గ్లాస్ స్టార్‌లు, ఇంటి అలంకరణకు రంగు రంగులు విద్యుత్ సెట్లను క్రైస్తవులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రైస్తవ సంప్రదాయ దుస్తులను ధరించి ఆటపాటలతో అలరించారు.



ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన



పాస్టర్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

- ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: త్వరలో జరగబోయే ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. శనివారం గోరంట్ల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో బూత్ కమిటీల ఎంపిక , పార్టీ శ్రేణులు పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ మండలంలోని 20 సచివాలయాల పరిధిలో బూత్ కమిటీలు వందశాతం వేయాలని నాయకులకు సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే నెలలో గోరంట్ల పట్టణంలో బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జెడ్పీటీసీ పాలే జయరాంనాయక్, జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మాజీ ఎంపీపీ అశ్వర్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

గోరంట్ల: దామరొడ్డు సమీపంలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి మాలధారులు, భక్తులు భక్తిశ్రద్ధలతో మండల పూజను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ మండల పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు



టేకులోడులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: టీడీపీ నేతలు ఇచ్చే అబద్ధపు హామీలను, మాయమాటలను ప్రజలెవరూ నమ్మి మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. మండలంలోని టేకులోడు, నల్లబొమ్మనపల్లి, దేమకేతేపల్లి పంచాయతీలోని ఓబుళాపురం గ్రామాల్లో శుక్రవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం'' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. దీపిక మాట్లాడుతూ టీడీపీ నేతలు ఇన్నాళ్లు కనిపించలేదని, ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడేసరికి మళ్లీ ప్రజలను మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, వాటిని నమ్మవద్దని సూచించారు. సీఎం జగన్ ఎన్నికలకు ముందు వచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా పక్కాగా అమలు చేశారన్నారు. అందుకే ధైర్యంగా ఓటు అడుగుతున్నామన్నారు. తరచూ మహిళలను అవమానపరిచే ఎమ్మెల్యే బాలకృష్ణకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ తిరుమలేష్, ఎంపీటీసీ కవిత, సనమ్ హుస్నా, స్థానిక నాయకులు జబీవుల్లా, రామచంద్రారెడ్డి, శేషాద్రిరెడ్డి, రవీంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సదాశివరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ శోభ

- ఎల్లుండి మధుడి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు



మధుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

అగళి: మండలంలో ఉన్న మధుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు ముస్తాబైంది. ఆదివారం పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించేందుకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలను ప్రారంభించి 50 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఈ వేడుకలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నారు. 1973 నుంచి 2023 వరకు మధుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొననున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలు ప్రతి ఒక్కరూ హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.



హిందూపురం మెయిన్ బజారులో అలంకరణలో పేట వేంకటేశ్వరస్వామి మండపం

ముక్కోటికి ముస్తాబు

హిందూపురం: ముక్కోటి ఏకదశిని పురస్కరించుకుని పట్టణంలోని వేంకటేశ్వరాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. శ్రీనివాస మందిరం, పేట వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్‌పీజీటీ రోడ్డు, బెంగళూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఎస్ఎఫ్ఐ మహాసభలను విజయవంతం చేయండి

హిందూపురం టౌన్: కాకినాడలో ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఎస్ఎఫ్ఐ 24వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబావలి కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాబావలి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, బాబాఫక్రుద్దీన్, హేమంత్, శశికుమార్, నాగరాజు, వినయ్, రోహిత్ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

పరిగి: మండలంలోని కాలువపల్లిలో ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహానికి పలువురు విరాళాలను వాల్మీకి సంఘం నాయకులకు అందజేశారు. హిందూపురం పట్టణ వాల్మీకి సంఘం కన్వీనర్ నరేష్ రూ. 20,116, కాలువపల్లికి చెందిన ఎంపీటీసీ చిక్కన్న, లాయర్ వన్నేరువప్ప రూ.5,116 నగదును విరాళంగా అందించారు. కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ సాకమ్మ, ఆమె కుమారుడు గిరి రూ.3,001 లను విరాళంగా అందించారు.

ట్రాన్స్‌కో అధికారులకు వినతి

హిందూపురం టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వీడీ రోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి , బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

హిందూపురం: పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలను అన్యాయంగా సస్పెండ్ చేశారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ఇందిరాగాంధీ సర్కిల్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షులు కేటీ.శ్రీధర్, డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

శ్రీనివాస రామానుజన్ ఆదర్శప్రాయుడు



పరిగి: ఏపీఆర్ఎస్‌లో శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



రొళ్ల : జెడ్పీహెచ్ఎస్‌లో నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



హిందూపురం: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

సాక్షిబృందం: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గణిత శాస్త్ర దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శ్రీనివాస రామానుజన్ ఆదర్శప్రాయుడని వక్తలు కొనియాడారు.

జోరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: పేదల సంక్షేమమే ధ్యేయ్యంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 24, 27వ వార్డుల్లో కౌన్సిలర్లు నాగేంద్రబాబు, నాగేంద్రమ్మల అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ ఏ.బీ బ్లాక్ అధ్యక్షులు సాధిక్, నరేష్ ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్ ' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించరించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని హెచ్‌ఆర్ పాళ్యం గ్రామంలో ఎంపీపీ కవిత ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందించారు. తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, వివిధ కమిటీల నాయకులు ఓబులేసు, జయరామప్ప, ఆటో హనుమంతు, హనుమంతరాయప్ప, సుబ్బారాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప

చిలమత్తూరు: త్వరలో నియోజకవర్గంలో జరుగనున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటను విజయవంతం చేయాలని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలో మంత్రి పర్యటించనున్న రూట్ మ్యాప్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ముఖ్య నేతలతో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం కెట్టిపల్లికి వెళ్లి ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డితో పాటు రాజారెడ్డితో భేటీ అయ్యారు. నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు కోరారు. ఆయన శుక్రవారం పట్టణంలోని మధుగిరి సర్కిల్‌లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. ఆ తర్వాత నిర్మాణ పనులపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాప్యం చేయకుండా పనులను పూర్తి చేసి ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ నాగేంద్ర, ఇంజనీర్ మురళీ ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

రొళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్ణప్ప, ఏఓ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయ ఆవరణలో సర్పంచ్ ప్రకాష్ అధ్యక్షతన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా మండల, గ్రామ స్థాయి అధికారులు ప్రజలతో సమావేశం నిర్వహించారు.

పావగడ: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వైఎన్ హొసకోట హోబళి పరిధిలోని పోతగానహళ్లి, సిద్ధాపురం, చిక్కహళ్లి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కెనరా బ్యాంక్ మేనేజర్ వరుణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పోలీసు బందోబస్తు

మడకశిర: మండలంలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహాస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు. నియోజకవర్గంలోని 5 పోలీస్‌స్టేషన్ల సిబ్బందే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పోలీసులను రప్పిస్తున్నామన్నారు. 26న బ్రహ్మరథోత్సవం, 27న జ్యోతులు, భూతప్పల ఉత్సవాలకు 30 ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం రామసుబ్బయ్య తెలిపారు.

గల్లి మారెమ్మకు పూజలు



గల్లి మారెమ్మను ప్రతిష్టాపన చేస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని చిట్నడకు దళిత కాలనీలో శుక్రవారం గల్లె మారెమ్మకు కాలనీ వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హలుకూరు సమీపంలో వెలసిన గ్రామ దేవత దొడగాటమ్మ కరియమ్మల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా చిట్నడకు గ్రామానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా దేవతలను ప్రత్యేకంగా దళిత కాలనీలో కూర్చొబెట్టి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం ఆది జాంబవ మఠాధీశులు ఓంకారస్వామి గ్రామ పెద్దలు కాలనీ వాసుల సమక్షంలో గల్లి మారెమ్మ ప్రతిష్ఠించారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

పరిగి: మండలంలోని కోనాపురంలో డ్రైనేజ్ పైప్‌లైన్ విషయంలో తగాదా పడిన ఘటనలో ఇరువర్గాలపై పరస్పర ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన గోవిందప్ప, శంకరప్ప అన్నదమ్ములు. అయితే డ్రైనేజ్‌కు సంబంధించిన మురికి నీరు పోవడానికి ఏర్పాటు చేసే పైప్‌లైన్ విషయంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శుక్రవారం ఇరువురి కుటుంబాల మధ్య చోటు చేసుకున్న సంఘటనలో గోవిందప్పకు తీవ్ర గాయాలయ్యాయి. శంకరప్పకూ గాయాలయ్యాయి.

కానిస్టేబుల్‌కు సన్మానం

రొళ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ పెద్దపప్పూరు మండలానికి బదిలీ అయిన రాజును శుక్రవారం సాయంత్రం స్టేషన్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జమేదార్ రామలింగయ్య, కానిస్టేబుళ్లు, నరసింహమూర్తి, పాతన్న తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

పరిగి: మండలంలోని హొన్నంపల్లి, బీచిగానిపల్లి, ఎర్రగుంట, ఊటుకూరు గ్రామాల్లో శుక్రవారం కంటి అద్దాలను పరిగి పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వరూపరెడ్డి, సురేష్‌కుమార్, రూటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కంటి చూపు సరిగా లేక అవస్థలు పడేవారమని, జగనన్న కంటి అద్దాలు ఇవ్వడంతో ఇప్పుడు చూపు బాగా కనిస్తోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.